# తెలంగాణ వెన్నెల వాక్కు

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU

TGTEL/25/A0871

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక :25 08-08- 2026 శనివారం పేజీలు: 4 వెల:03/-



తెలంగాణ వెన్నెల వాక్కు విలేకరులు కావలెను

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో


# వర్షాలు సమృద్ధిగా కురవాలని వరుణ యాగం

## 10న నాగార్జునసాగర్‌లో ప్రత్యేక పూజలు.. పూర్ణాహుతిలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు సుభిక్షంగా పండాలని ఆకాంక్షిస్తూ ఈ నెల 10న నాగార్జునసాగర్‌లో వరుణ యాగం నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నిర్ణయం మేరకు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు, వేదపండితులు, సిద్ధాంతులు నిర్ణయించిన ముహూర్తంలో యాగ క్రతువులను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయవిహార్ ప్రాంగణాన్ని యాగ నిర్వహణకు ఎంపిక చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట దేవస్థానానికి చెందిన అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు, యాగ క్రతువులను నిర్వహించనున్నారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి జలాశయాలు, చెరువులు, కుంటలు నీటితో కళకళలాడాలని, కృష్ణా, గోదావరి నదులు జలకళను సంతరించుకోవాలని సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

వర్షాధార వ్యవసాయంపై ఆధారపడే రైతులకు అనుకూల పరిస్థితులు ఏర్పడి పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, వ్యవసాయ రంగం అభివృద్ధి, నీటి వనరులు సమృద్ధిగా ఉండాలన్న ఆకాంక్షతో వరుణ దేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో వరుణ యాగం కొనసాగనుంది. యాగ క్రతువులు పూర్తయిన అనంతరం నిర్వహించే మహత్తర పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించి నాగార్జునసాగర్‌లో అవసరమైన ఏర్పాట్లను అధికారులు చేపడుతున్నారు.

# ఆగస్టు 15న కోటి 6 లక్షల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

### పంట మార్పిడితో రైతులకు అధిక ఆదాయం.. అందుబాటులోని నీటిని శాస్త్రీయంగా వినియోగించాలి



హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఆగస్టు 15న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రంలో కోటి 6 లక్షల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లాల్లో పంపిణీ ప్రక్రియకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వ్యవసాయం, నీటి లభ్యత, వన మహోత్సవం, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ తదితర అంశాలపై శుక్రవారం రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల

2


## ఐఏఎస్ అధికారులపై కోర్టు ధిక్కరణ కేసులు:

### ప్రభుత్వాల తప్పిదాలకు అధికారులకు తిప్పలు శ్రేయస్కరమేనా?

హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగేష్ భీమపాక చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర పాలనా యంత్రాంగంలో సాగుతున్న తీవ్రమైన లోపాలను, ప్రభుత్వాల అలసత్వాన్ని మరోసారి ఎత్తిచూపాయి. ప్రభుత్వాలు చేసే పొరపాట్లు, నిర్ణయాత్మక తప్పిదాల వల్ల ఐఏఎస్ వంటి ఉన్నత స్థాయి, బాధ్యతాయుతమైన అధికారులు అనవసరంగా కోర్టు ధిక్కరణ కేసులు ఎదుర్కోవాల్సి రావడం తీవ్ర విచారకరమని ధర్మాసనం వ్యాఖ్యానించడం ఒక సాధారణ విషయం కాదు. విధాన నిర్ణయాలు తీసుకునే ప్రజాప్రతినిధుల వైఫల్యాల వల్ల, బాధ్యతాయుతమైన అధికారులను పదే పదే కోర్టుల చుట్టూ తిప్పడం, విచారణలకు పిలిపించి బోనులో నిలబెట్టడం ఎంతో బాధాకరమని న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలు ప్రజాపాలన ఏ దిశగా సాగుతుందో స్పష్టం చేస్తున్నాయి.

రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాపై నమోదైన కోర్టు ధిక్కరణ పిటిషన్ల విచారణ సందర్భంగా ధర్మాసనం చేసిన ఆవేదన పూరిత వ్యాఖ్యలు ఈ పరిస్థితుల తీవ్రతకు అద్దంపడుతున్నాయి. "ఆయనపై నమోదైన అన్ని కోర్టు ధిక్కరణ కేసుల్లో ఒకవేళ శిక్ష పడితే, ఆయన తన జీవితకాలం మొత్తాన్ని జైలులోనే గడపాల్సి



2

# 'కొత్త' రైతులకు భరోసా ఏదీ?

### నిర్మల్ జిల్లాలో రైతు భరోసా కోసం ఎదురుచూపులు

### కొత్తగా పట్టాలు పొందిన రైతులకు అందని పెట్టుబడి సాయం

నిర్మల్, ఆగస్టు 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లాలో ఇటీవల కొత్తగా పట్టాదార్ పాస్‌పుస్తకాలు పొందిన అర్హులైన రైతులకు రైతు భరోసా పెట్టుబడి సాయం అందకపోవడంతో ఆందోళన నెలకొంది. వానాకాలం సాగు కీలక దశకు చేరుకున్నప్పటికీ తమ ఖాతాల్లో నిధులు జమ కాకపోవడంతో వ్యవసాయ పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని పలు మండలాల్లో భూ రికార్డుల సవరణ, వారసత్వ మార్పులు, భూ విభజన, నూతన పట్టాల మంజూరు తదితర ప్రక్రియల అనంతరం పలువురు రైతులకు కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకాలు జారీ అయ్యాయి. అధికారులు సూచించిన మేరకు భూ వివరాలు, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేసి రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ నెలకు పైగా గడిచినా పెట్టుబడి సాయం అందలేదని వారు చెబుతున్నారు.

ఇప్పటికే జిల్లాలో పలువురు అర్హులైన రైతులకు విడతల వారీగా రైతు భరోసా నిధులు జమయ్యాయి. అయితే కొత్తగా పట్టాలు పొందిన రైతులు, ఇటీవల భూ వివరాలు నవీకరించబడిన రైతుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. బ్యాంకు ఖాతా అనుసంధానం, ఈ-కేవైసీ తదితర ప్రక్రియలు పూర్తికాకపోవడం కూడా కొందరి దరఖాస్తుల పెండింగ్‌కు కారణంగా ఉన్నట్లు సమాచారం. దీంతో ఒకే గ్రామంలో కొందరికి రైతు భరోసా అందుతుండగా, మరికొందరు రైతులు మాత్రం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రస్తుతం జిల్లాలో పత్తి, వరి, సోయాబీన్, మొక్కజొన్న తదితర పంటల సాగు ముమ్మరంగా కొనసాగుతోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు పెరగడంతో రైతులకు పెట్టుబడి సాయం ఎంతో అవసరంగా మారింది. ప్రభుత్వం నుంచి రావాల్సిన రైతు భరోసా ఆలస్యం కావడంతో పలువురు రైతులు అప్పులు చేసి సాగు పనులు కొనసాగిస్తున్నట్లు చెబుతున్నారు.



పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిశీలించాలి

కొత్తగా పట్టాదార్ పాస్‌పుస్తకాలు పొందిన అర్హులైన రైతులకు కూడా ఇతర రైతుల మాదిరిగానే రైతు భరోసా అందించాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు. సాంకేతిక కారణాలు, రికార్డుల పరిశీలన పేరుతో నిధుల విడుదలను జాప్యం చేయకుండా పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి అర్హులైన రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రైతులు తమ బ్యాంకు ఖాతా ఆధార్‌తో అనుసంధానమైందో లేదో, ఈ-కేవైసీ పూర్తయిందో లేదో, భూ రికార్డుల్లో వివరాలు సక్రమంగా నమోదయ్యాయో లేదో పరిశీలించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అవసరమైతే సంబంధిత మండల వ్యవసాయ అధికారి లేదా తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు స్థితిని తెలుసుకోవాలని చెబుతున్నారు.

సాగు కీలక దశలో ఉన్నందున కొత్తగా పట్టాలు పొందిన అర్హులైన రైతులకు రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని జిల్లా రైతాంగం ప్రభుత్వాన్ని కోరుతోంది.

## బహ్రెయిన్ ఎడారిలో తెలంగాణ బిడ్డలకు అండ:

### సమాజ సేవకుడు కోటగిరి నవీన్‌కు ఘన సన్మానం




హైదరాబాద్ బ్యూరో

ఉపాధి కోసం గల్ఫ్ ఎడారి దేశమైన బహ్రెయిన్ వెళ్ళి అక్కడ వివిధ రకాల సమస్యలు, కష్టాల పాలవుతున్న తెలంగాణ ప్రవాసీయులకు, కార్మికులకు అహర్నిశలూ అండగా నిలుస్తూ నిస్వార్థంగా సేవలు అందిస్తున్న ప్రముఖ సమాజ సేవకుడు కోటగిరి నవీన్ కుమార్ అర్హమైన గౌరవాన్ని అందుకున్నారు. బహ్రెయిన్‌లో నివాసముంటున్న ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ప్రజావాణి విభాగం మరియు ప్రణాళికా సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించింది.

2

## మనిషికి నాగరికతను అద్దిన చేనేత కార్మికులు

హైదరాబాద్ బ్యూరో



తన నరాలను పోగులుగా, రక్తాన్ని వర్ణాలుగా, గుండెలను కండెలుగా మార్చి, నిత్యం చిందించే చెమట చుక్కలను సుందరమైన చీరలుగా మలిచి మనిషికి నాగరికతను అద్దిన గొప్ప శ్రామికులు చేనేత కార్మికులు. తమ అపారమైన శ్రమతో, కళాత్మక సృజనతో సమాజానికి వస్త్రాన్ని అందిస్తున్న చేనేత కార్మికుల త్యాగం, సాధన ఎంతో సాటిలేనివని బీఆర్ఎస్ పార్టీ కొనియాడింది. ఈ సత్సందర్భంగా, జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్రంలోని చేనేత, జౌళి రంగానికి చెందిన నేతన్నలందరికీ బీఆర్ఎస్ అధినాయకత్వం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసింది.

మగ్గాలపై అద్భుతమైన కళాఖండాలను, వర్ణచిత్రాల వంటి వస్త్రాలను సృష్టించగలిగే అపారమైన సత్తా, నైపుణ్యం తెలంగాణ నేతన్న సొంతమని పార్టీ గుర్తుచేసింది. ఒక చిన్న అగ్గిపెట్టెలో పట్టేంత అద్భుతమైన నైపుణ్యంతో చీరలను నేసే అరుదైన ప్రతిభ మన తెలంగాణ చేనేత కార్మికులకు ఉందనడంలో

2

తెలంగాణ
వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871



# పోడు భూముల వివాదంపై రైతులతో అధికారుల ప్రత్యేక సమీక్ష!

**– కడేం మండలం ఉడుంపూర్ గ్రామంలో శాంతియుత వాతావరణం కాపాడాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ జానకి షర్మిల సూచన**

నిర్మల్, ఆగస్టు 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):
కడేం మండలం ఉడుంపూర్ గ్రామంలో గత కొంతకాలంగా నెలకొన్న పోడు భూముల సమస్యలు, అటవీ భూముల వివాదాల నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు, గ్రామానికి చెందిన రైతులు పరస్పరం సంయమనం పాటించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉడుంపూర్ గ్రామస్తులు, అటవీ, రెవెన్యూ మరియు పోలీసు శాఖల ఉన్నతాధికారులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి క్షేత్రస్థాయి పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు.

రైతులు, అధికారులతో విడివిడిగా విచారణ: ఈ సమీక్షా సమావేశంలో భాగంగా గ్రామంలోని పోడు భూముల సాగుదారులు, అటవీ శాఖ అధికారులతో కలెక్టర్ భవేశ్ మిశ్రా విడివిడిగా మాట్లాడి భూ సమస్యల మూలాలను, వారి ఆందోళనలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. పొలాల సరిహద్దులు, అటవీ భూముల పరిరక్షణ తదితర అంశాలపై ఇరువర్గాల వాదనలను విన్నారు. భూ సమస్యలు ఎదురైనప్పుడు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా, పరస్పర అవగాహన, చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని ఆయన హితవు పలికారు.

జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలి: వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు గానీ, విధులు నిర్వర్తించే అటవీ శాఖ సిబ్బందికి గానీ ఎలాంటి సమస్యలు లేదా ఇబ్బందులు ఎదురైనా తక్షణమే జిల్లా పరిపాలనా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ కోరారు. ఉడుంపూర్ గ్రామంలోని భూ సమస్యలకు శాశ్వత, చట్టబద్ధమైన పరిష్కారం చూపడానికి జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని, రైతులకు తగిన భరోసా ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజలు, అధికారులు ఎలాంటి ఉద్రిక్తతలకు తావులేకుండా శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని కోరారు. సమస్యలు ఉన్నప్పుడు చట్టబద్ధమైన మార్గాల్లోనే పరిష్కారాలు వెతుక్కోవాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీసు, రెవెన్యూ యంత్రాంగాలు ఎల్లప్పుడూ



సిద్ధంగా ఉన్నాయని, ఏ చిన్న సమస్య తలెత్తినా ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు.

అటవీ ప్రాంతాల్లోని భూ వివాదాల పరిష్కారానికి రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. రీ-సర్వే మరియు సరిహద్దుల నిర్ణయ ప్రక్రియల్లో పారదర్శకత పాటించాలన్నారు. గ్రామస్థులతో నిరంతరం సమాచార వ్యవస్థను కొనసాగించడం ద్వారా అనవసర ఘర్షణలను నివారించవచ్చని స్పష్టం చేశారు. ఈ ముందస్తు సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఆర్డీఓ దేవీదాస్, డీఎస్పీ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కడేం మండల స్థానిక అధికారులు మరియు ఉడుంపూర్ గ్రామానికి చెందిన రైతు ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కుబీర్ బడుల అక్రమాలపై విచారణ జరపాలి: సీవైఎస్ఎస్ కలెక్టర్‌కు వినతి

నిర్మల్/కుబీర్, ఆగస్టు 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా కుబీర్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న వరుస అవినీతి, విధులకు గైర్హాజరవుతున్న ఉపాధ్యాయుల వ్యవహారాలపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని చాత్ర యువ సంఘర్షణ సమితి (సీవైఎస్ఎస్) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్కర్ అరవింద్ డిమాండ్ చేశారు.



శుక్రవారం ఆయన యుఎస్ఎఫ్ఐ ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాను కలెక్టరేట్‌లో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ.. కుబీర్ మండలం కుప్టి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలి అక్రమ డిప్యుటేషన్ వల్ల అక్కడి విద్యార్థులకు విద్యాబోధన అందక తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. 2025-26 విద్యా సంవత్సరం ముగింపు సమయంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రత్యేక చొరవతో డిప్యుటేషన్ ఆర్డర్ ఇచ్చారని, ఇది విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధమని ఆరోపించారు. దీనిపై గ్రామస్తులు, విద్యార్థి సంఘాలు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అలాగే అంతర్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విధులకు గైర్హాజరు కావడంపై పలుమార్లు ఆధారాలతో ఫిర్యాదు చేసినప్పటికీ జిల్లా విద్యాశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. కుబీర్ మండలంలో పాఠశాలలకు వచ్చే ప్రభుత్వ గ్రాంట్ నిధులను నిబంధనలకు విరుద్ధంగా సీఆర్పీలు, ఎంఐఎస్ సిబ్బంది వ్యక్తిగత ఖాతాల్లోకి మళ్లించి నిధులు పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. బాధ్యులపై విచారణ జరిపించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తుంటే, జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. కుబీర్ మండల విద్యాధికారి, సంబంధిత ఉపాధ్యాయులు, నిధుల మళ్లింపునకు బాధ్యులైన కాంప్లెక్స్ హెచ్ఎంలపై కఠిన చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూఎస ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నవీన్ పాల్గొన్నారు.

# కార్పొరేట్ బడుల కంటితుడుపు నోటీసులు!

## విద్యాశాఖ పిల్లికూతలు వినేదెవరు?

తెలంగాణ విద్యాశాఖ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు జారీ చేసిన తాజా ఆదేశాలు చూస్తుంటే “కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు” ఉంది. తరగతుల వారీగా ఫీజుల వివరాలను నోటీస్ బోర్డులపై ప్రదర్శించాలని, విద్యాశాఖ ఎడ్యుకేషన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, లేకుంటే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని బెదిరించిన ఉత్తర్వులు కేవలం కాగితాలకే పరిమితమయ్యే మరో విఫల ప్రయోగంలా కనిపిస్తున్నాయి. దశాబ్దాలుగా ప్రైవేట్ విద్యా సంస్థల నిలువు దోపిడీతో నలిగిపోతున్న సగటు మధ్యతరగతి తల్లిదండ్రులకు ఈ ఆర్భాటపు ఉత్తర్వులు ఎటువంటి ఉపశమనాన్నీ ఇవ్వవు. విద్యాశాఖ జారీ చేసిన ఈ ఆదేశాలు కార్పొరేట్ విద్యా మృగాల ముందు ఒక చిన్న పిల్లి కూత లాంటివి తప్ప మరొకటి కాదు. ఏళ్ల తరబడి సాగుతున్న ఈ దోపిడీ పర్వానికి ప్రభుత్వం ఇచ్చే షోకాజ్ నోటీసులు ఏమాత్రం అడ్డుకట్ట వేయలేవని చిన్న పిల్లవాడిని అడిగినా చెబుతాడు.

అక్షరాభ్యాసం నేర్పే నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలకే ఏటా ముప్పై వేల నుంచి ఏకంగా లక్షన్నర రూపాయల వరకు గుంజుతున్నారంటే ఈ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ఏ స్థాయిలో దిగజారిందో, ఎంతగా వ్యాపారమయమైందో అర్థం చేసుకోవచ్చు. ‘విద్యాదానం’ అత్యున్నతమైనదిగా భావించిన పవిత్రమైన నేల మీద, నేడు విద్యను ఒక రోత పుట్టించే లాభసాటి వ్యాపారంగా మార్చేశారు. స్కూల్ ఫీజుల పేరుతో తల్లిదండ్రుల నుంచి వసూలు చేసే లక్షలాది రూపాయలు చాలవన్నట్లు, పాఠశాల ప్రాంగణాలనే చిల్లర కొట్టులుగా మార్చేసి పుస్తకాలు, యూనిఫాంలు, బెల్టులు, టైలు, చివరకు షూస్, సాక్సులు కూడా తమ వద్దే కొనాలని విధించే రూల్స్ తల్లిదండ్రుల మెడపై పెట్టిన పదునైన కత్తి లాంటివి. బయట బహిరంగ మార్కెట్‌లో చాలా చవకగా లభించే సాధారణ వస్తువులకు తమ సొంత బ్రాండ్ల పేర్లు తగిలించి వేలకు వేలు విక్రయిస్తూ దోచుకుంటుంటే, ఇది విద్యాబోధనా లేక పగటిపూట సాగుతున్న బహిరంగ దోపిడీయా అన్న తీవ్రమైన అనుమానం ప్రతి ఒక్కరిలోనూ కలుగుతోంది.

అసలు సిసలు ప్రశ్న ఏంటంటే, రాష్ట్రంలో విచ్చలవిడిగా వెలిసిన బడా కార్పొరేట్ యాజమాన్యాలు ప్రభుత్వ ఆదేశాలను లేదా విద్యాశాఖ జారీ చేసే జీవోలను ఏనాడైనా ఖాతరు చేశాయా? విద్యాశాఖ గతంలో ఇచ్చిన అనేక జీవోలను, కనీసం ఉన్నత న్యాయస్థానాలు ఇచ్చిన స్పష్టమైన తీర్పులను కూడా తుంగలో తొక్కిన ఘనమైన చరిత్ర ఈ కార్పొరేట్ విద్యా సంస్థల సొంతం. ఇప్పుడు స్కూలు ప్రాంగణాల్లో బోర్డు మీద ఫీజుల వివరాలు పెట్టమనడం వల్ల లేదా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయమనడం వల్ల అసలు సమస్య ఎలా పరిష్కారమవుతుంది? వారు నిర్ణయించే అన్యాయమైన, అక్రమమైన భారీ ఫీజులనే బోర్డుల మీద పెద్ద పెద్ద అక్షరాలతో రాసి, “మా ఫీజు ఇంతే... కడితే కట్టండి, లేకపోతే స్కూలు వదిలి పొండి” అని దర్జాగా చెబితే ప్రభుత్వం వారిపై ఏం చర్యలు తీసుకుంటుంది? ఇక్కడ జరుగుతున్న ఫీజుల ప్రదర్శన అనేది కార్పొరేట్ల దోపిడీని అధికారికం చేయడమే తప్ప, ఫీజుల నియంత్రణ కానేరదు. విద్యాశాఖ ఇచ్చే షోకాజ్ నోటీసులను తమ లీగల్ టీమ్‌లతో, కోర్టు స్టేలతో బుట్టదాఖలు చేయించడం కార్పొరేట్లకు వెన్నతో పెట్టిన విద్య.

రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా ఈ విద్యా రాబందుల ఆగడాలకు అడ్డుకట్ట పడకపోవడం వెనుక ఉన్న అసలు నగ్న సత్యం అందరికీ తెలిసిందే. చాలా కార్పొరేట్ పాఠశాలలు, ప్రైవేట్ స్కూళ్ల నెట్‌వర్క్‌ల వెనుక ఉన్నది ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాజకీయ నాయకులు, అమాత్యులు లేదా వారి ముఖ్య అనుచరులే. దీనికి తోడు క్షేత్రస్థాయిలో ఉన్న మండల విద్యాధికారులు, జిల్లా విద్యాధికారులు కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు విసిరే ఎంగిలి మెతుకులకు ఆశపడి లేదా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి విచక్షణారహితంగా అనుమతులు మంజూరు చేస్తున్నారు. ఫీజులను అదుపు చేసే కఠినమైన చట్టాలు లేకపోవడంతో విద్యా



శాఖ కేవలం పేపర్ల మీద నోటీసుల డ్రామాలకే పరిమితమవుతోంది. ఈ దుస్థితిని చూస్తుంటే విద్యాశాఖ నిజంగా ప్రజా ప్రయోజనాల కోసం పనిచేస్తోందా? లేక కార్పొరేట్ విద్యా సంస్థల చేతిలో కేవలం ఒక కీలుబొమ్మగా మారి నాటకాలాడుతోందా అన్న అనుమానం ప్రజల్లో మరింత బలపడుతోంది.

పక్కనే ఉన్న తమిళనాడు రాష్ట్రాన్ని ఒకసారి పరిశీలిస్తే అక్కడ ఒక విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేకమైన ఫీజు నియంత్రణ కమిటీ ఉంది. స్కూల్లో ఉండే మౌలిక సదుపాయాలు, భవనాలు, ఉపాధ్యాయుల నైపుణ్యాన్ని బట్టి ప్రతి బడికి ఎంత గరిష్ట ఫీజు ఉండాలో ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. అంతకు మించి ఒక్క రూపాయి ఎక్కువ వసూలు చేసినా ఆ స్కూలు లైసెన్స్ రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటారు. ఆ స్థాయి తెగువ, దమ్ము, నాయకత్వ పటిమ తెలంగాణ ప్రభుత్వానికి ఉందా అన్నది ఇక్కడ ఉత్పన్నమవుతున్న ప్రధాన ప్రశ్న. తెలంగాణలో కూడా శాసనసభలో ప్రత్యేకంగా పాఠశాల ఫీజు నియంత్రణ చట్టం ప్రవేశపెట్టి, దాన్ని కఠినంగా అమలు చేయడానికి కావలసిన రాజకీయ ఇచ్ఛాశక్తి పాలకుల్లో పూర్తిగా లోపించిందనేది వాస్తవం.

ఈ అరాచక పరిస్థితి మారాలంటే ప్రభుత్వం కేవలం ఆన్‌లైన్ నోటీసుల ముసుగులో కాలయాపన చేయకుండా తమిళనాడు తరహాలో అత్యంత కఠినమైన చట్టం తెచ్చి ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల ఫీజులకు నిర్దిష్ట పరిమితి విధించాలి. నిబంధనలు ఉల్లంఘించే స్కూళ్లకు కేవలం కాలయాపన చేసే షోకాజ్ నోటీసులతో సరిపెట్టకుండా, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి పాఠశాలల గుర్తింపును శాశ్వతంగా రద్దు చేయాలి. పాఠశాలల్లో వ్యాపార సరుకులుగా మారిన పుస్తకాలు, డ్రెస్సుల విక్రయాన్ని తక్షణమే నిషేధించి, తల్లిదండ్రులు బయట బహిరంగ మార్కెట్‌లో తమకు నచ్చిన చోట కొనుగోలు చేసే స్వేచ్ఛనివ్వాలి. అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఇంగ్లీష్ మీడియం విద్యను అందించినప్పుడే కార్పొరేట్ వ్యవస్థ నడుం విరుగుతుంది.

ప్రభుత్వం ఇకనైనా కంటితుడుపు చర్యలు, ప్రచార ఆర్భాటపు జీవోలు బంద్ చేయాలి. “షోకాజ్ నోటీసులు ఇస్తాం” అని కాగితాల మీద బెదిరించడం మానేసి, కార్పొరేట్ రక్కసిపై ఉక్కుపాదం మోపాలి. విద్యను కొనుగోలు చేసే వ్యాపార సరుకుగా కాకుండా, ప్రతి చిన్నారి ప్రాథమిక హక్కుగా మార్చకపోతే రాబోయే రోజుల్లో తల్లిదండ్రుల నుంచి వ్యక్తమయ్యే తీవ్ర ఆగ్రహజ్వాలల్లో ఈ అక్రమ విద్యా వ్యవస్థతో పాటు పాలకుల కుర్చీలు కూడా కాలిపోక తప్పవు.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# ఆగస్టు 15న కోటి 6 లక్షల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.
ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని అవసరాలకు అనుగుణంగా శాస్త్రీయంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సాగు, తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ ఎక్కడా తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

పంట మార్పిడితో నష్టాలకు చెక్
వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పంట మార్పిడి విధానాన్ని అమలు చేయడం ద్వారా రైతులకు నష్టాలు తగ్గడంతో పాటు అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులకు పంటల వైవిధ్యంపై అవగాహన కల్పించి, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాలను పెంచేందుకు చేపట్టిన పంట కుంటల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్
వన మహోత్సవం లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ పూర్తి చేయడంతో పాటు వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామస్థాయిలో ఇరిగేషన్ అడ్వైజరీ సమావేశాలు నిర్వహించి రైతులకు అందుబాటులో ఉన్న నీటి వనరులు, సాగు ప్రణాళికలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని తెలిపారు.
వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల వారీగా వర్షపాతం, పంటల సాగు, నీటి లభ్యత తదితర అంశాలను సమీక్షించారు.

# ఐఏఎస్ అధికారులపై కోర్టు ధిక్కరణ కేసులు:

వస్తుంది” అని వ్యాఖ్యానించడం విశేషం. ఒక రకంగా చూస్తే ఇది ఉన్నతాధికారులపై పడుతున్న మానసిక, వ్యవస్థాగత ఒత్తిడికి నిదర్శనం. ఆర్థిక లభ్యత, నిధుల విడుదల లేదా ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలు పాలకుల చేతుల్లో ఉంటాయి. కానీ వాటి అమలులో జరిగే జాప్యానికి అధికారులపై కోర్టు ధిక్కరణ కేసులు నమోదు కావడం, అధికారులు తమ విలువైన సమయాన్ని కోర్టుల విచారణలకే వెచ్చించాల్సి రావడం వల్ల అసలు పాలన తీవ్రంగా దెబ్బతింటోంది.

ఈ కేసు విచారణ సందర్భంలోనే ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో సాగుతున్న లోపాలపై మరియు ప్రజాధనం వృధా అవుతున్న తీరుపై హైకోర్టు అత్యంత కీలకమైన, ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. పేద రైతులకు ఆసరాగా నిలవడానికి ప్రవేశపెట్టిన ‘రైతుబంధు’ వంటి పథకం అత్యంత శ్రేష్ఠమైనదే అయినప్పటికీ, అందులో శాస్త్రీయమైన వర్గీకరణ లేదా ప్రణాళిక లేకపోవడం పెద్ద లోపంగా మారింది. సరైన వర్గీకరణ లేకపోవడం వల్ల నిరుపేద రైతులతో పాటు, వందల ఎకరాల భూములు ఉన్న కోటీశ్వరులు కూడా ప్రభుత్వ సొమ్మును లబ్ధిగా పొందుతున్నారని ధర్మాసనం పదునైన వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు కేవలం సమాజంలోని నిజమైన అర్హులకు మాత్రమే అందాలని, కానీ సరైన పర్యవేక్షణ, కఠినమైన నిబంధనలు లేకపోవడం వల్ల ఎంతోమంది అనర్హులు ఈ పథకాల ప్రయోజనాలను పొందుతున్నారని కోర్టు అభిప్రాయపడింది.

?పాలకవర్గాలు తీసుకునే అరకొర నిర్ణయాలు, కోర్టులు ఇచ్చిన ఆదేశాలను సకాలంలో అమలు చేయకపోవడం వల్లనే ప్రభుత్వ యంత్రాంగం మరియు న్యాయస్థానాల మధ్య తరచూ ఇటువంటి ఘర్షణ వాతావరణం ఏర్పడుతోంది. సీనియర్ అధికారులు రోజూ కోర్టుల చుట్టూ తిరుగుతూ వివరణలు ఇచ్చుకోవడానికే సమయం సరిపోతే, ప్రజలకు అందించాల్సిన సేవలు, ప్రాజెక్టుల పురోగతి ఎలా సాధ్యమవుతుంది? కంటోన్మెంట్ బోర్డు బకాయి నిధులకు సంబంధించిన కేసు విచారణలో భాగంగా కొన్ని నిధులను ఇప్పటికే విడుదల చేశామని, మిగిలిన బకాయిలను కూడా విడతల వారీగా చెల్లిస్తామని అధికారి తరఫున హాజరైన న్యాయవాది హైకోర్టుకు హామీ ఇచ్చినప్పటికీ, ఈ తరహా సమస్య ఒక్క కంటోన్మెంట్‌కే పరిమితం కాలేదు.

ప్రభుత్వాలు ఇకనైనా కళ్ళు తెరిచి న్యాయస్థానాలు ఇచ్చే ఆదేశాలను పరిమితి దాటకుండా సకాలంలో నెరవేర్చేందుకు ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్ రూపొందించుకోవాలి. అంతేకాకుండా, సంక్షేమ పథకాల విషయంలో ప్రజాధనం దుర్వినియోగం కాకుండా నిజమైన అర్హులను మాత్రమే గుర్తించే వ్యవస్థను బలోపేతం చేయాలి. అప్పుడే ఆర్థిక వ్యవస్థ బాగుపడటంతో పాటు, ఐఏఎస్ అధికారులపై పడుతున్న కోర్టు ధిక్కరణ కేసుల భారం తగ్గి పాలన సరైన పట్టాలెక్కుతుంది.

# బహ్రెయిన్ ఎడారిలో తెలంగాణ బిడ్డలకు అండ:

శుక్రవారం నాడు హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో నవీన్ కుమార్‌ను అధికారులు, ప్రభుత్వ ప్రతినిధులు శాలువాలు కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, సీఎం ప్రజావాణి ఇన్చార్జ్ డాక్టర్ జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కె. విద్యాసాగర్ ముఖ్య అతిథులుగా పాల్గొని కోటగిరి నవీన్ కుమార్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, ఆయన అందిస్తున్న ప్రతిఫలాపేక్ష లేని సమాజ సేవను కొనియాడారు. బహ్రెయిన్ దేశంలో ఉపాధి కోసం వెళ్లి వివిధ రకాల ఇబ్బందుల్లో, ఆపదల్లో చిక్కుకున్న తెలంగాణ ప్రవాస కార్మికులను ఆదుకోవడంలో నవీన్ కుమార్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటున్నారని అధికారులు ప్రశంసించారు. విదేశీ గడ్డపై బాధితులకు అవసరమైన చట్టపరమైన సాయం, వైద్యపరమైన సేవలు, అత్యవసర సమయాల్లో స్వదేశానికి పంపించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయడంలో ఆయన చూపుతున్న చొరవ ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. సమాజ సేవకుడు కోటగిరి నవీన్ కుమార్ సేవలు రాబోయే రోజుల్లో కూడా ఇలాగే నిరంతరాయంగా కొనసాగాలని, ఆపదలో ఉన్న మరెంతో మంది గల్ఫ్ ప్రవాసులకు ఆయన కొండంత అండగా నిలవాలని ఈ సందర్భంగా డాక్టర్ జి. చిన్నారెడ్డి మరియు కె. విద్యాసాగర్ ఆకాంక్షించారు. స్వదేశానికి, సొంత కుటుంబానికి దూరంగా విదేశాల్లో ఉంటూ కూడా సొంత నేల వాసుల కష్టాలను తన కష్టాలుగా భావించి స్పందించే గుణం నేటి సమాజంలో ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని వారు వ్యాఖ్యానించారు. సమాజ సేవకుడు కోటగిరి నవీన్ కుమార్ నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలానికి చెందిన హసకొత్తూరు గ్రామ నివాసి. ఉపాధి నిమిత్తం బహ్రెయిన్

# ధర్మం అంటే ఆచారాలే కాదు... ఆచరణ కూడా!

## నేటి సమాజానికి సనాతన ధర్మం చెబుతున్న జీవన సందేశం

ఆగస్టు 07(తెలంగాణ వెన్నెల వాక్కు)



భారతీయ సంస్కృతి గురించి మాట్లాడినప్పుడు మొదటగా గుర్తుకు వచ్చేది సనాతన ధర్మం. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ జీవన విధానం కేవలం పూజలు, వ్రతాలు, యజ్ఞాలు, ఉత్సవాలకు మాత్రమే పరిమితం కాలేదు. మనిషి ఎలా జీవించాలి? కుటుంబాన్ని ఎలా నడిపించాలి? సమాజం పట్ల బాధ్యత ఏమిటి? ప్రకృతిని ఎలా కాపాడాలి? అనే ప్రశ్నలకు సనాతన ధర్మం స్పష్టమైన మార్గదర్శకత్వాన్ని అందించింది. అందుకే దీనిని మతం కంటే జీవన విధానంగా పేర్కొంటారు.
నేటి వేగవంతమైన జీవితంలో సాంకేతికత పెరిగింది. ప్రపంచం మన చేతిలోని మొబైల్ ఫోన్‌లోకి వచ్చింది. సమాచారం క్షణాల్లో అందుతోంది. కానీ అదే సమయంలో మనుషుల మధ్య అనుబంధాలు తగ్గుతున్నాయనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. కుటుంబ బంధాలు బలహీనపడటం, పెద్దల పట్ల గౌరవం తగ్గడం, ప్రకృతి పట్ల నిర్లక్ష్యం, స్వార్థపూరిత ఆలోచనలు పెరగడం వంటి పరిణామాలు కనిపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో సనాతన ధర్మం చెప్పే విలువలు మరింత ప్రాసంగికంగా కనిపిస్తున్నాయి.
ధర్మం అంటే చాలామంది దేవాలయానికి వెళ్లడం, పూజలు చేయడం, పండుగలు జరుపుకోవడం అని భావిస్తారు. కానీ భారతీయ శాస్త్రాలు చెప్పే ధర్మం దీనికంటే ఎంతో విస్తృతమైనది. సత్యాన్ని పాటించడం, ఇతరులకు హాని చేయకుండా జీవించడం, తల్లిదండ్రులను గౌరవించడం, గురువులను ఆదరించడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం, ప్రకృతిని సంరక్షించడం కూడా ధర్మమే. ఈ విలువలు మనిషిని మంచి వ్యక్తిగా తీర్చిదిద్దుతాయి.
భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్పిన ప్రధాన సందేశం కర్తవ్యాన్ని నిజాయితీతో నిర్వర్తించడమే. ఫలితంపై అధిక మమకారం లేకుండా ధర్మబద్ధంగా పని చేయాలని గీత బోధిస్తుంది. ఈ సందేశం యుద్ధరంగానికే పరిమితం కాదు. ప్రతి ఉద్యోగి, రైతు, ఉపాధ్యాయుడు, వైద్యుడు, ప్రజా ప్రతినిధి, విద్యార్థి---ప్రతి ఒక్కరికీ వర్తిస్తుంది. తన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించే వ్యక్తి సమాజానికి ఆదర్శంగా నిలుస్తాడు.
రామాయణం మనకు కుటుంబ విలువలను నేర్పుతుంది. శ్రీరాముడు రాజుగా మాత్రమే కాదు, కుమారుడిగా, సోదరుడిగా, భర్తగా, ప్రజలను ప్రేమించే నాయకుడిగా ఆదర్శంగా నిలిచాడు. మహాభారతం ధర్మం, అధర్మం మధ్య జరిగే సంఘర్షణను వివరిస్తూ చివరికి సత్యం, న్యాయం విజయం సాధిస్తాయని తెలియజేస్తుంది. ఈ గ్రంథాలు కథలు మాత్రమే కాదు; ప్రతి తరానికి మార్గనిర్దేశం చేసే జీవన పాఠాలు.
తెలంగాణలోని బాసర జ్ఞాన సరస్వతి ఆలయం, యాదాద్రి, వేములవాడ, భద్రాచలం వంటి క్షేత్రాలు లక్షలాది భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతతను అందిస్తున్నాయి. ఈ క్షేత్రాలకు వెళ్లే భక్తులు కేవలం దర్శనం చేసుకోవడం మాత్రమే కాకుండా, అక్కడి సంస్కృతి, సేవా కార్యక్రమాలు, పరిశుభ్రత, పరస్పర గౌరవం వంటి అంశాలను కూడా తమ జీవితంలో ఆచరించినప్పుడే యాత్ర పరిపూర్ణమవుతుంది.
ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు చట్టాలు మాత్రమే పూర్తి పరిష్కారం చూపలేవు. మనసులో నైతిక విలువలు పెరిగినప్పుడే నిజమైన మార్పు వస్తుంది. ఇంట్లో పిల్లలకు మంచి సంస్కారం నేర్పడం, పాఠశాలల్లో విలువలతో కూడిన విద్య అందించడం, సమాజంలో పరస్పర గౌరవాన్ని పెంపొందించడం---ఇవన్నీ ధర్మానికి సంబంధించిన అంశాలే.
మన పూర్వీకులు నిర్మించిన దేవాలయాలు రాతి కట్టడాలు మాత్రమే కాదు. అవి సంస్కృతిని, కళలను, శిల్పకళను, సామాజిక ఐక్యతను తరతరాలకు అందించిన జీవంతమైన కేంద్రాలు. వాటిని కాపాడుకోవడం అంటే కేవలం గోడలను సంరక్షించడం కాదు; అవి బోధించిన విలువలను కూడా సంరక్షించడం.
ఈరోజు మనకు అత్యంత అవసరమైనది కొత్త ధర్మాన్ని వెతకడం కాదు. మనకు వారసత్వంగా వచ్చిన మంచి విలువలను మళ్లీ జీవితంలో ఆచరించడం. సత్యం, కరుణ, సేవ, నిజాయితీ, కర్తవ్యనిర్వహణ---ఈ ఐదు విలువలను ప్రతి వ్యక్తి పాటిస్తే కుటుంబం బలపడుతుంది. కుటుంబం బలపడితే సమాజం బలపడుతుంది. సమాజం బలపడితే దేశం అభివృద్ధి చెందుతుంది.
ధర్మం పుస్తకాలలో ఉండాల్సిన విషయం కాదు. అది ప్రతి ఇంటిలో, ప్రతి హృదయంలో, ప్రతి పనిలో ప్రతిబింబించాలి. అప్పుడే భారతీయ సంస్కృతి చెప్పిన జీవన విధానం తన అసలు సారాన్ని మరోసారి ప్రపంచానికి చాటగలదు.

## ఖానాపూర్ మండలంలో ఎక్సైజ్ దాడులు: 15 లీటర్ల నాటుసారా స్వాధీనం

నిర్మల్, ఆగస్టు 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):



జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ ఆదేశాల మేరకు నిర్మల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గంజాయి, గుడుంబా నిర్మూలనపై శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఖానాపూర్ మండలంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రంగస్వామి తెలిపారు.తనిఖీల్లో భాగంగా తంస్లపాడ-ఖానాపూర్ మార్గంలో బైక్‌పై తరలిస్తున్న 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. అలాగే సుభాష్ నగర్‌లో అల్లెపు శైలజ వద్ద 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.గతంలో నమోదైన గుడుంబా కేసులలో నిందితులుగా ఉన్న ఆరుగురు వ్యక్తులను ఖానాపూర్ తహసీల్దార్ సుజాత ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రంగస్వామి వెల్లడించారు.గుడుంబా, గంజాయి, నల్లబెల్లం అక్రమ రవాణాపై సమాచారం తెలిస్తే ఎక్సైజ్ శాఖకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు వసంతరావు, అభిషేక్ పాల్గొన్నారు.

## కురన్నపేట్ అర్బన్ రెసిడెన్షియల్ బడిని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

నిర్మల్,ఆగస్టు7 (తెలంగాణ వెన్నెల వాక్కు):



నిర్మల్ జిల్లా పరిధిలోని కురన్నపేట్ వద్ద గల ప్రభుత్వ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న, ఎంఈఓ సిద్ధ పద్మ సంయుక్తంగా తనిఖీ చేశారు.ఈ సందర్శనలో భాగంగా అధికారులు పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, విద్యార్థుల వసతి గదులు, భోజన శాల మరియు తాగునీటి సౌకర్యాలను నిశితంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన తీరుపై ఉపాధ్యాయులతో మాట్లాడారు.పాఠశాల పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల క్రమశిక్షణ మరియు పాఠశాలలో నెలకొల్పిన ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం పట్ల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఈఓ భోజన్న ప్రత్యేక సంతృప్తిని వ్యక్తం చేశారు.పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించేలా ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. పర్యటనలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముధోల్ రబీంద్ర పాఠశాలలో అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలు




ముధోల్, ఆగస్టు 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తెలంగాణ విశిష్ట సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ముధోల్ మండల కేంద్రంలోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వర్షాకాలంలో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని ప్రార్థిస్తూ విద్యార్థులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు.
ఈ వేడుకల సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణతో అమ్మవారి వేషధారణల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, విద్యార్థులు పోతరాజుల వేషాలతో డప్పు చప్పుళ్లకు అనుగుణంగా విన్యాసాలు చేస్తూ అలరించారు. సాంప్రదాయ బ్యాండు మేళాలు, కోలాటాలు, ఆటపాటలు మరియు విద్యార్థుల వినూత్న సాంస్కృతిక ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.
పాఠశాల ప్రిన్సిపాల్ అసంవర్ సాయినాథ్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ.. అమ్మవారి దివ్య అనుగ్రహంతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే కేవలం పాఠ్యాంశాలే కాకుండా మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల పట్ల అవగాహన, గౌరవం కల్పించాలనే ఉద్దేశంతోనే ప్రతి సంవత్సరం ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ వేడుకల కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజేందర్, చైర్మన్ భీంరావు దేశాయ్, డైరెక్టర్ పోతన్న యాదవ్, ప్లే స్కూల్ ఇన్‌చార్జి హేమలత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ముధోల్ జెడ్పీహెచ్ఎస్ బడిలో ఆషాఢ మాస గోరింటాకు సంబరాలు

ముధోల్, ఆగస్టు 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని ముధోల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో (జెడ్పీహెచ్ఎస్) శుక్రవారం గోరింటాకు సంబరాలను అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా పాఠశాల విద్యార్థినులు సంప్రదాయ పట్టు దుస్తుల్లో హాజరై ఒకరికొకరు చేతులకు అందమైన గోరింటాకు డిజైన్లు పెట్టుకుని వేడుకల్లో సంతోషంగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణమంతా పండుగ శోభను సంతరించుకోగా, విద్యార్థినులు తెలంగాణ జానపద గీతాలు పాడుతూ సంప్రదాయ నృత్యాలతో సహచరులను అలరించారు. ఆషాడ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, ఆధ్యాత్మిక విశిష్టత, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల గురించి ఉపాధ్యాయులు విద్యార్థినులకు వివరంగా బోధించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థులకు తరగతి గది పాఠ్యాంశాలతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడం కూడా విద్యలో ఒక ముఖ్య భాగమేనని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో మన ఆచారాల పట్ల గౌరవాన్ని, అవగాహనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ సంబరాల్లో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినులు, పాఠశాల బోధనేతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



## దిలావర్‌పూర్ గ్రామంలో ప్లాస్టిక్ వాడకంపై హెచ్చరిక నోటీసులు జారీ

దిలావర్‌పూర్, ఆగస్టు 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):




దిలావర్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం పారిశుధ్య సిబ్బంది ఆధ్వర్యంలో 'డ్రై డే' అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) గోవర్ధన్ నేరుగా పర్యవేక్షించారు.ఈ సందర్భంగా వ్యాపార సముదాయాలు, దుకాణాల యజమానులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ఎంపీఓ గోవర్ధన్ హెచ్చరిక నోటీసులు జారీ చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలు విధిగా పాటించాలని ఆదేశించారు.పాఠశాలలు, రద్దీ ప్రాంతాలు, బస్టాండ్ ఆవరణలో బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయించారు. వర్షాకాలం దృష్ట్యా ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ అవగాహన కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, స్థానిక ప్రజాప్రతినిధులు అనిల్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## సారంగాపూర్ వింధ్యా స్కూల్లో భక్తిశ్రద్ధలతో బోనాల సంబరాలు

సారంగాపూర్, ఆగస్టు 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):



సారంగాపూర్ మండల కేంద్రంలో గల వింధ్యా స్కూల్లో ఆషాడమాసాన్ని పురస్కరించుకుని బోనాల పండుగ ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలంగాణ సంప్రదాయ దుస్తులు ధరించి, ముఖానికి రంగులు వేసుకుని పోతురాజుల వేషధారణలతో చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.సకాలంలో వర్షాలు కురిసి గ్రామాల్లో పాడిపంటలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ విద్యార్థినులు, ఉపాధ్యాయులు నైవేద్యాలతో కూడిన బోనాలను పోచమ్మ తల్లికి సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. డప్పు వాయిద్యాల నడుమ విద్యార్థులు చేసిన సంప్రదాయ నృత్యాలు ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని నింపాయి.ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఆకుల రమేష్, ప్రిన్సిపల్ కే. నవీన్ కుమార్ మాట్లాడుతూ.. మన సంస్కృతిని భవిష్యత్తు తరాలకు అందించడంలో పాఠశాలల పాత్ర కీలకమన్నారు. తెలంగాణ పండుగల విశిష్టతను చిన్నారులకు తెలియజేయడానికే ఈ సంబరాలు జరిపామన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరాం శ్రీనివాస్, సాయినాథ్, శ్రీనివాస్ గౌడ్, శ్రీలత, పల్లవి, సుమన్య, లావణ్య, సంధ్యారాణి, స్రవంతి, సులోచన, గౌతమి, దివ్య, సౌజన్య, పావని, ప్రేరణ, శరణ్య, జ్యోతి, విద్యార్థులు మరియు పోషకులు పాల్గొన్నారు.

## ఖర్జి-పెండల్ ధారి రోడ్డుకు అటవీ అనుమతులు ఇవ్వాలి: అట్ల పోతారెడ్డి

సారంగాపూర్/ఉట్నూర్, ఆగస్టు 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):



సారంగాపూర్ మండలం ఖర్జి నుండి పెండల్ ధారి వరకు ఉన్న నిలిచిపోయిన రహదారి నిర్మాణానికి తక్షణమే అటవీ శాఖ అనుమతులు ఇప్పించి పనులను పూర్తి చేయాలని కిసాన్ సెల్ నిర్మల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అట్ల పోతారెడ్డి డిమాండ్ చేశారు. ఉట్నూర్‌లోని కొమరం భీమ్ కాంప్లెక్స్‌లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విచారణలో చైర్మన్ ఎం. కోదండరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖర్జి-పెండల్ ధారి రహదారికి అటవీ శాఖ అనుమతులు లేకపోవడం వల్ల పనులు నిలిచిపోయాయని, దీనివల్ల స్థానిక ఆదివాసీలు, రైతులు తీవ్ర రవాణా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అలాగే ప్రాంతంలో పామాయిల్ సాగు చేస్తున్న రైతులకు తగిన లోడ్‌తో విద్యుత్ అందక నష్టపోతున్నారని, త్రీ-ఫేస్ విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యను పరిష్కరించాలని కోరారు.ఏజెన్సీ ప్రాంతాల్లోని రైతులకు పంట రుణాలు, విత్తనాలు మరియు ఇతర ప్రభుత్వ మద్దతు సదుపాయాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రంపై స్పందించిన చైర్మన్ కోదండరెడ్డి స్పందిస్తూ.. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ కమిటీ రాష్ట్ర సభ్యుడు స్వదేశ్ పరికిపండ్ల, పెండల్ ధారి మాజీ సర్పంచ్ సిడం గంగారం, కాంగ్రెస్ నాయకుడు భూమన్న, రైతు స్వరాజ్య వేదిక ఉమ్మడి జిల్లా నాయకుడు సంగెపు బొర్రన్న పాల్గొన్నారు.




దిలావర్పూర్,ఆగస్టు 07(తెలంగాణ వెన్నెల వాక్కు)
దిలావర్పూర్ మండల కేంద్రంలో వర్షం పడితే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిర్మల్--భైంసా జాతీయ రహదారి 44పై బస్సులు ఆగే ప్రదేశంలో ప్రతి వర్షానికి నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి నిత్యం వేలాది మంది నిర్మల్, భైంసా పట్టణాలకు రాకపోకలు సాగిస్తుండగా, బస్సులు ఎక్కే సమయంలో నీటిని దాటాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

వర్షం కురిసిన వెంటనే బస్సులు ఆగే ప్రాంతం నీటితో నిండిపోవడంతో ప్రయాణికులు రహదారి పక్కన నిలబడేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సు వచ్చినప్పుడు నీటిలో నుంచి నడుచుకుంటూ వెళ్లి బస్సు ఎక్కాల్సి వస్తోంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనాలు నీటిలో నుంచి వెళ్లే సమయంలో ప్రయాణికులపై నీరు చిమ్మడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది.

దిలావర్పూర్ మండల కేంద్రానికి సుమారు కిలోమీటర్ దూరంలోనే టోల్‌గేట్ ఉంది. జాతీయ రహదారిపై నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మరోవైపు మండల కేంద్రం కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా ప్రజలు వివిధ అవసరాల కోసం ఇక్కడికి వస్తుంటారు. ఇంతటి రద్దీ ఉన్న ప్రాంతంలో బస్సులు ఆగే చోట వర్షపు నీరు నిలిచి పోవడం ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యంగా మారింది.

ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి పునరావృతమవుతున్నప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లేకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు సులభంగా బయటకు వెళ్లేలా డ్రైనేజీ ఏర్పాటు చేయడంతో పాటు బస్సులు ఆగే ప్రాంతాన్ని మెరుగుపరచాలని కోరుతున్నారు.

జాతీయ రహదారి 44పై వేలాది మంది ప్రయాణించే ఈ ప్రాంతంలో ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి వర్షానికి నీటి మడుగుగా మారే బస్సు నిలుపుదల ప్రాంతానికి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించాలి: అదనపు కలెక్టర్లు

**– వేడుకలకు సర్వాంగ సుందరంగా వేదిక ముస్తాబు చేయాలని అధికారులకు ఆదేశం**
**– విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, పోలీసు బందోబస్తుపై ప్రత్యేక సమీక్ష**




నిర్మల్, ఆగస్టు 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):
భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా, అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పక్కా ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంద్రాగస్టు వేడుకల ముందస్తు నిర్వహణ, నిర్వహణ కమిటీల ఏర్పాటుపై వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వేడుకలను విజయవంతం చేయడానికి శాఖల వారీగా కేటాయించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలన్నారు.జిల్లా కేంద్రంలో జరిగే ప్రధాన వేడుకలకు ప్రభుత్వ నియమావళి, ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులను, ముఖ్య అతిథులను ఆహ్వానించాలని అదనపు కలెక్టర్లు సూచించారు. వేడుకల ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయాలన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులచే దేశభక్తి ఉట్టిపడేలా వినూత్న సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శింపజేయాలన్నారు. ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులకు, శ్రేష్ఠ సేవలు అందించిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు.కార్యక్రమం జరుగుతున్నంతసేపు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా వాటర్‌ప్రూఫ్ షామియానాలు వేయించాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.కార్యక్రమానికి విచ్చేసే విద్యార్థులు, ప్రజల ఆరోగ్య పరిరక్షణ నిమిత్తం ముందస్తు జాగ్రత్తగా ప్రాంగణంలోనే ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. 108 అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. వేడుకల మైదానంలో ముందస్తుగా ఫాగింగ్, బ్లీచింగ్ పిచికారీ పనులు పూర్తి చేయాలన్నారు.ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా రవాణా మార్గాల మళ్లింపు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాల వద్ద స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దిగ్విజయం చేయాలని అదనపు కలెక్టర్లు పిలుపునిచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి రాథోడ్ రమేష్, డీఎస్పీ శ్రీనివాస్, ఆర్డీఓ దేవీదాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ నూతన పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవాలి: ఎమ్మెల్యే పవార్

**– వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్ల కొరకు ఎంపీడీఓ ఆఫీసులో అప్లై చేయాలి**
**– దరఖాస్తు సమర్పించి తప్పనిసరిగా అక్నాలెడ్జ్‌మెంట్ రసీదు పొందాలని విజ్ఞప్తి**

ముధోల్, ఆగస్టు 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ నియోజకవర్గ పరిధిలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న అర్హులైన నిరుపేదలు ప్రభుత్వం అందిస్తున్న నూతన సామాజిక పింఛన్ల కొరకు తక్షణమే దరఖాస్తు చేసుకోవాలని ముధోల్ శాసనసభ్యుడు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి ఒక ముఖ్య ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం కొత్తగా అందించే పింఛన్ల ప్రక్రియను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.




ప్రభుత్వ నిబంధనల ప్రకారం నూతనంగా వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల, చేనేత, గీత కార్మికులు, ఒంటరి మహిళల పెన్షన్ల కోసం అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ వెంటనే సంబంధిత కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత ఉండి పింఛన్లు రాని పేద కుటుంబాలకు ఈ అవకాశం కొండంత అండగా నిలుస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎలాంటి గందరగోళానికి గురికాకుండా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పెన్షన్ పొందేందుకు నిర్దేశించిన అర్హతలు తెలుసుకుని, అధికారిక దరఖాస్తు ఫారాన్ని పూర్తిగా నింపాలని ఎమ్మెల్యే కోరారు. ఆధార్ కార్డు, ఓటరు కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం, సదరం సర్టిఫికేట్ లేదా మరణ ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా జత చేసి సంబంధిత మండల ప్రజా పరిషత్ (ఎంపీడీఓ) కార్యాలయాల్లో సమర్పించాలని స్పష్టం చేశారు.

అధికారులకు దరఖాస్తు సమర్పించిన అనంతరం కార్యాలయం నుండి తప్పనిసరిగా రసీదు (అక్నాలెడ్జ్‌మెంట్) తీసుకుని భద్రపరుచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గంలో అర్హులైన ఒక్క నిరుపేద కూడా పెన్షన్ పథకానికి దూరం కాకూడదన్నదే తమ ప్రధాన ధ్యేయమని వివరించారు.

పెన్షన్ల మంజూరు పేరుతో నిరుపేద ప్రజలను మోసం చేసే దళారులను నమ్మవద్దని ఎమ్మెల్యే హెచ్చరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉచితంగానే పింఛన్లు మంజూరవుతాయన్నారు. దరఖాస్తుల ప్రక్రియలో సందేహాలు ఉంటే నేరుగా ఎంపీడీఓ లేదా పంచాయతీ కార్యదర్శులను సంప్రదించవచ్చని తెలిపారు.

ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో చొరవ తీసుకుని అర్హులైన నిరుపేదలకు దరఖాస్తు ఫారాలు నింపడంలో సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే కోరారు.

# అడేల్లి పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



సారంగాపూర్, ఆగస్టు 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):సారంగాపూర్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహా అడేల్లి పోచమ్మ అమ్మవారిని బోథ్ శాసనసభ్యుడు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు.అనంతరం జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో 461వ ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థి పబ్బు ప్రథమ్‌ను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేకంగా అభినందించారు. తలమడుగు మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన పబ్బు అశోక్ కుమారుడైన ప్రథమ్ జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. ప్రథమ్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి కష్టపడి చదివి జాతీయ స్థాయి పోటీ పరీక్షలో 461వ ర్యాంకు సాధించడం నియోజకవర్గానికే గర్వకారణమని కొనియాడారు. విద్యార్థులు ప్రథమ్‌ను స్ఫూర్తిగా తీసుకుని తమ లక్ష్యాల సాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. ప్రథమ్ ఉన్నత చదువులు పూర్తి చేసి సమాజానికి, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తలమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పాక్స్) చైర్మన్ ఎల్మా శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సర్పంచ్ అశోక్, నాయకులు కార్తీక్ రెడ్డి, గంగారెడ్డి, అడేల్లి ఆలయ మాజీ చైర్మన్ లక్ష్మీనారాయణ మరియు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మందకృష్ణ మాదిగ సుదీర్ఘ పోరాట ఫలితమే ఆరోగ్యశ్రీ: డాక్టర్ కొమ్ము శేఖర్

**– ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం సందర్భంగా నిర్మల్‌లో కేక్ కట్ చేసి పండ్ల పంపిణీ**
**– నిరుపేదలకు ఉచిత కార్పొరేట్ వైద్యాన్ని అందించిన ఘనత ఎమ్మార్పీఎస్‌దేనని వెల్లడి**

నిర్మల్, ఆగస్టు 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గుండెజబ్బులు, ఇతర ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న నిరుపేద పిల్లలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సాగించిన మహోన్నత పోరాట ఫలితమే నేటి 'ఆరోగ్యశ్రీ' పథకమని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎమ్ఎస్ఎఫ్) ఇన్చార్జ్ డాక్టర్ కొమ్ము శేఖర్ మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం నిర్మల్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 'ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం' నిర్వహించారు.ఈ వేడుకలకు ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాస్ మాదిగ అధ్యక్షత వహించగా, నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం స్థానిక ప్రజలకు, హాస్టల్ విద్యార్థులకు ఉచితంగా అరటిపండ్లను పంపిణీ చేశారు. డాక్టర్ కొమ్ము శేఖర్ మాదిగ మాట్లాడుతూ, 2004 ఆగస్టు 7న మందకృష్ణ మాదిగ చేపట్టిన బృహత్తర ఉద్యమం వల్లే నాడు ఆరోగ్యశ్రీ పథకం వచ్చిందన్నారు.నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో కోట్లాది మంది నిరుపేద కుటుంబాలకు ఆరోగ్యశ్రీ బీమా పథకం కొండంత అండగా, ప్రాణదాతగా ఒక సంజీవనిలా పని చేస్తోందని కొనియాడారు.



ఎమ్మార్పీఎస్ ఉద్యమ స్ఫూర్తితోనే కేంద్ర ప్రభుత్వం కూడా దేశవ్యాప్తంగా 'ఆయుష్మాన్ భారత్' పేరిట ఉచిత ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేస్తోందన్నారు. సమాజం లోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ, ఆరోగ్య ఫలాలు అందించడమే కాకుండా, పేద వర్గాల ఆర్థిక వికాసం, రాజకీయ భాగస్వామ్యం కోసం మందకృష్ణ మాదిగ నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఆయన తీసుకునే ప్రతి సామాజిక నిర్ణయానికి సమాజమంతా ఏకతాటిపై నిలిచి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

ఎదల ఆరోగ్య రక్షణ కోసం ఉద్యమించిన చరిత్ర ఎమ్మార్పీఎస్‌కు మాత్రమే సొంతమని పలువురు వక్తలు కొనియాడారు. భవిష్యత్తులోనూ పేదల హక్కుల సాధనకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు.ఈ వేడుకల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు బొబ్బిలి శ్రీనివాస్ మాదిగ, శనిగారపు రవి, గాడేకర్ మహేశ్వర్, నల్లూరి అరుణ్, నామత్కార్ లక్ష్మణ్, పత్తిరి వెంకటరమణ, కులగని రాజు, కత్తెం పాక శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిర్మల్ వశిష్ట ఉన్నత పాఠశాలలో వైభవంగా బోనాల పండుగ

**– దుర్గామాత చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేసిన బృందం**

నిర్మల్, ఆగస్టు 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తెలంగాణ విశిష్ట సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే బోనాల పండుగ ఉత్సవాలను నిర్మల్‌లోని వశిష్ట ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పోతరాజులు, అమ్మవార్ల వేషధారణలతో పాఠశాల ప్రాంగణంలో సందడి చేశారు.




ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ అనగానే అందరికీ ముందుగా గుర్తువచ్చేది బోనాల పండుగ అని తెలిపారు. రాష్ట్రంలో ఈ పండుగకు అత్యంత ప్రాముఖ్యత ఉందన్నారు. బోనాల ఉత్సవాలు రాష్ట్రంలోని ప్రతి పల్లెపల్లెనా అత్యంత వైభవంగా జరుగుతాయని పేర్కొన్నారు.

ఉత్సవాల్లో భాగంగా ముందుగా దుర్గామాత చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పించి జానపద గేయాలకు ఆటపాటలతో సందడి చేశారు. మన ఆచార వ్యవహారాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జి. మాధవి, ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని శోభాయమానంగా ముగించారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com